క్లుప్తంగా

రాస పోలమాంబకు విశేష పుష్పాలంకరణ


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

తగరపువలస: భీమిలి మండలం మజ్జివలస గ్రామదేవత రాస పోలమాంబ అమ్మవారిని ఆలయ కమిటీ ప్రతినిధులు మంగళవారం ప్రత్యేకంగా పట్టుచీర, జరబర పువ్వులతో అలంకరించారు. ఈ అలంకరణకు మజ్జివలస కళ్లాలకు చెందిన పుర్రేవు సాయికృష్ణ శర్మ, శ్రీనివాస శర్మ కుటుంబ సభ్యులు సహాయ సహకారాలు అందించారు. ఆలయానికి వచ్చే భక్తు లకు తుపాకుల అప్పల రాసయ్య, రాసమ్మ దంపతులు ప్రసాదాలు పంపిణీ చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు విశేషంగా పాల్గొని, అమ్మవారికి మొక్కులు చెల్లించారు.

హైబ్రిడ్ కూరగాయల సాగుతో అధిక దిగుబడి


కూరగాయల సాగుపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

తగరపువలస: హైబ్రిడ్ కూరగాయల సాగుతో అధిక దిగుబడి సాధించవచ్చని జిల్లా వ్యవసాయాధికారి కొత్తూరు అప్పలస్వామి, ఆనందపురం మండలం ఏవో చావా సంధ్యారత్నప్రభ రైతులకు తెలియచేశారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆనందపురం మండలం బంటుపల్లి కళ్లాలలో రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కూరగాయల సస్యరక్షణ, పంటల సాగు పథకం, ప్రభుత్వం అందించే సాయం గురించి తెలియజేశారు.వ్యవసాయశాఖ అసిస్టెంట్ షేక్ అహ్మద్ గౌస్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి


సమావేశంలో మాట్లాడుతున్న పైడిరాజు

మధురవాడ: సీపీఐ సభ్యులు, కార్యకర్తలు ఇతర ప్రాంతాల కంటే ముఖ్యంగా వారు నివాసం ఉంటున్న ప్రాంతాలలో ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇచ్చి పనిచేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు పిలుపునిచ్చారు. మధురవాడ శివశక్తినగర్‌లో నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. 5వ వార్డులో ఈ కాలనీ ప్రారంభంలో శివశక్తినగర్‌లో 54మంది పేదలకు ఇళ్ల పట్టాలు ఇప్పించి, ఈ ప్రాంతానికి పేరు కూడా పెట్టింది సీపీఐ నాయకులేనన్నారు. అటువంటి ప్రాంతం ఇప్పుడు దిన దినాభివృద్ధి చెందుతోందన్నారు. ఆ పార్టీ శత వార్షికోత్సవాలను పురస్కరించుకుని ఈ విధంగా విస్తృతంగా సమావేశాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా సమితి నాయకురాలు ఎంఏ బేగం, ఏరియా కార్యదర్శి సత్యనారాయణ, కేశవయ్య, ఎస్కే సల్మా, అన్నాజీ తదితరులు పాల్గొన్నారు.

పండగ వేళా తప్పని ప'రేషన్'


రేషన్ కోసం క్యూలో నిలబడిన లబ్ధిదారులు

కొమ్మాది: ప్రభుత్వం అందిస్తున్న రేషన్ కోసం ప్రజలకు మళ్లీ ఇబ్బందులు తప్పడం లేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఇంటి ముంగిటకే రేషన్ అందించేవారు. కానీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రేషన్ కోసం పరేషాన్ తప్పడం లేదు. జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ రాజీవ్‌నగర్‌లో రేషన్ బియ్యం కోసం పండగ పూట కూడా మహిళలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రేషన్ అందించే వాహనాన్ని ఊరికి దూరంగా పెట్టడంతో గంటల తరబడి క్యూలో వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లబ్ధిదారుల ఇబ్బందులకు మంగళవారం రేషన్ వాహనం వద్ద బారులు తీరిన చిత్రమే నిదర్శనం.


తీరం వద్ద నీటిలో ఉన్న పెద్ద బండరాళ్లు


అలలు వెనక్కి వెళ్లినప్పుడు బయటపడ్డ రాళ్లు


గోస్తని నది, సముద్రం కలిసే సాగరసంగమం ప్రాంతం

ఆహ్లాదం మాటున ఆపద

- ప్రాణాంతకంగా భీమిలి తీరం
- ప్రమాదకరంగా నీటి లోపలి రాళ్లు, గోతులు
- లోపలికి లాగేస్తున్న కెరటాలు
- మృత్యువాత పడుతున్న సందర్శకులు
- పట్టించుకోని పర్యాటకశాఖ

భీమునిపట్నం: ఒంపులు తిరిగి విశాలంగా ఉన్న సముద్రం.. దగ్గరలోనే గోస్తని నది సముద్రంలో కలిసే ప్రాంతం.. ఎంతో అద్భుతంగా ఉండి, పర్యాటకులను ఇట్టే కట్టి పడేస్తుంది. అయితే, ఆ ఆహ్లాదం వెనుక ఆపద పొంచి ఉంటోంది. స్నానాల కోసం సముద్రంలోకి దిగే సందర్శకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అలల మాటున పొంచి ఉన్న ప్రమాదాన్ని పసిగట్టలేక యువకులు ప్రాణాలు సైతం కోల్పోతున్నారు.

ఎందుకింత ప్రమాదం?

భీమిలి బీచ్‌రోడ్డులోని మంగమారిపేట, రుషికొండ, సాగర్‌నగర్ బీచ్‌లతో పాటు విశాఖ వరకు ఉన్న తీర ప్రాంతం మొత్తం అత్యంత ప్రమాదకరంగా ఉంటుంది. ఇది ఇతర ప్రాంతాలకన్నా ఎంతో భిన్నంగా ఉంటుంది, ఇక్కడ నీటి కింద కొద్ది అడుగుల దూరంలోనే పెద్ద పెద్ద బండరాళ్లు ఉంటాయి. దీంతో నీటిలో జారి పడిపోయేవారు ఈ రాళ్లకు కొట్టుకోవడంతో మరణించడం గాని, తీవ్ర గాయాల పాలవడం గానీ జరుగుతోంది.

ప్రమాదకరంగా గోతులు

నీటిలోని అతి సమీపంలో సుమారు పది నుంచి ఇరవై అడుగుల లోతు కలిగిన గోతులు ఉంటాయి. నీటిలో దిగేవారికి ఆ విషయం తెలియకపోవడంతో ముందుకు నడిచినప్పుడు రెండు నుంచి మూడు అడుగులు మాత్రమే నీరు ఉంటుంది, కానీ ఒక్కసారిగా పెద్ద గోతుల్లో మునిగిపోతుంటారు.

అలలే మృత్యువై..

అసలైన ప్రమాదం అలల రూపంలో ఉంది. ఇక్కడ నీటి కింద రాళ్లు ఉండడంతో అలలు సుడులు తిరుగుతూ ముందుకు వచ్చి వెనక్కి వెళ్లేటప్పుడు కూడా సుడులు తిరుగుతూ వెళతాయి. దీనివల్ల అండర్‌వాటర్ కరెంట్ ఏర్పడ్డం వల్ల నీటి ప్రవాహ వేగం చాలా తీవ్రంగా ఉంటుంది. ఇది బయటకు ఏమాత్రం కనబడదు, కానీ అలలు వెనక్కి వెళ్లేటప్పుడు అతి వేగంగా ఉంటుంది. ఆ విషయం తెలియని సందర్శకులు సరదాగా స్నానాలకు దిగితే, ఒక్కసారిగా అలలు లోపలికి లాక్కెళ్లిపోతున్నాయి. ఇటువంటి సమయాల్లో తీరంలో మత్స్యకారులు చాలా మందిని రక్షిస్తుండగా, కొందరు మాత్రం ప్రాణాలను కోల్పోతున్నారు. ప్రతి సంవత్సరం భీమిలి తీరంలో సుమారు పది మందికి పైగా మరణిస్తుండగా.. మొత్తం తీరంలో ఇరవై నుంచి ముప్పయి మంది వరకు ఉంటున్నారు.

ఇక్కడ గోస్తని నది, సముద్రం కలిసే ప్రాంతంలోనూ చాలా మంది స్నానాలకు దిగుతుంటారు. ఇక్కడ కూడా ప్రవాహ వేగంతో పాటు అండర్ వాటర్ కరెంట్ వల్ల కొట్టుకుపోయి, అనేక మంది ప్రాణాలను కోల్పోతున్నారు.


స్నానాలు చేస్తున్న సందర్శకులు (ఫైల్)

పర్యాటకశాఖ చర్యలు అంతంత మాత్రమే

ఇంత ప్రమాదకర తీర ప్రాంతంలో తగిన రక్షణ చర్యలను తీసుకోవలసిన పర్యాటకశాఖ స్పందన అంతంత మాత్రంగానే ఉంది. ఇక్కడి పరిస్థితిని గుర్తించి, పది సంవత్సరాల క్రితం పర్యాటక శాఖ ఇద్దరు గార్డులను నియమించింది. వారు ఉదయం నుంచి సాయంత్రం వరకు తీరంలో ఉంటూ సందర్శకులెవరూ సముద్రంలోకి దిగకుండా చూసేవారు. దీంతో ఎవరికీ ప్రమాదం జరగకుండా ఉండేది. తరువాత వారిని అధికారులు కారణం లేకుండా తొలగించారు. అప్పటి నుంచి పరిస్థితి మళ్లీ మామూలే అయింది. తీరంలో హెచ్చరిక బోర్డు ఉన్నా, ఎవరూ పట్టించుకోవడం లేదు.


భీమిలి బీచ్ వద్ద ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

పిక్నిక్ సీజన్‌లో ప్రమాదాలు

కార్తీకమాసంలో పిక్నిక్‌లకు విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి పెద్ద ఎత్తున వస్తారు. ఇందులో చాలా మంది స్నానాల కోసం దిగడంతో ప్రమాదాల బారిన పడుతుంటారు. ఇప్పటికైనా పర్యాటక శాఖ అధికారులు స్పందించి, బీచ్‌లో గార్డులను మళ్లీ ఏర్పాటు చేస్తే ప్రమాదాలను నివారించవచ్చు.

నిత్యం హెచ్చరిస్తున్నాం



ఇక్కడ తీరంలో స్నానాలకు దిగుతున్న వారిని ఎప్పటికప్పుడు హెచ్చరిస్తున్నాం. కానీ, కొందరు ఖాతరు చేయకుండా దిగి ప్రమాదాల బారిన పడుతున్నారు. మత్స్యకారులం ఉండే సమయాల్లో ఎవరైనా మునిగిపోతుంటే వారికి రక్షిస్తున్నాం. మిగిలిన సమయాల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి.

– ఉమ్మడి మహేష్, మత్స్యకారుడు, భీమిలి

గార్డులను ఏర్పాటు చేయాలి



గతంలో ఇక్కడ తీరంలో పర్యాటకశాఖ ఇద్దరు గార్డులను నియమించడం వల్ల ప్రమాదాలు జరగకుండా నివారించేవారు. కానీ, వారిని తొలగించిన తరువాత అనేక సంఘటనలు జరుగుతున్నాయి. పలువురు ప్రాణాలను కూడా కోల్పోతున్నారు. దీనిపై పర్యాటకశాఖ అధికారులు స్పందించి, గార్డులను ఏర్పాటు చేయాలి.

– తెరుపల్లి అప్పారావు, భీమిలి

అదనపు కట్నం డిమాండ్ చేసిన వ్యక్తిపై కేసు నమోదు

మధురవాడ: పెళ్లి కోసం అదనపు కట్నం డిమాండ్ చేసిన వ్యక్తిపై పీఎం పాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పీఎం పాలెం పోలీసులు తెలిపిన వివరాలివి.. మారికవలస లీలాకృష్ణ టయోటా షోరూం వెనుక క్యారా హోమ్స్‌లో చిత్రి భారతి రమణ కుటుంబంతో నివాసం ఉంటున్నారు. దాయమ్మ అనే పెళ్లిళ్ల బ్రోకర్ ద్వారా శ్రీకాకుళం జిల్లా, పొందూరు మండలం కంచారం గ్రామానికి చెందిన మజ్జిరాజుతో సంబంధం కుదుర్చుకున్నారు. పెళ్లి సమయంలో పెళ్లి కుమారుడికి కట్నంగా రూ.10 లక్షలు నగ దు, 5 తులాల బంగారం, ఒక మోటారు సైకిల్ ఇచ్చేందుకు పెళ్లికుమార్తె తల్లిదండ్రులు అంగీకరించారు. అయితే పెళ్లి కుమారుడు, బంధువులు అదనపు కట్నం కోసం డిమాండ్ చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

రాంగ్ రూట్లో వచ్చి బైక్‌కు ఢీ

ఒకరికి గాయాలు

మధురవాడ: రాంగ్ రూట్‌లో వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో సంభవించిన ప్రమాదంలో వద్దాది సత్యంనాయుడు (51)అనే వ్యక్తికి గాయాలయ్యాయి. దీనికి సంబంధించి పీఎం పాలెం పోలీసులు తెలిపిన వివరాలివి.. పరదేశిపాలేనికి చెందిన వద్దాది సత్యంనాయుడు ఆదివారం మధ్యాహ్నం 2.45 గంటల సమయంలో తన కుమార్తెను మారికవలసలో దింపడం కోసం ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. ఇతడు జాతీయ రహదారిలో మారికవలస పాత కాలనీ ఆంజనేయ స్వామి గుడి వద్దకు రాగానే గుర్తు తెలియని వ్యక్తి రాంగ్ రూట్‌లో వచ్చి వారి వాహనాన్ని ఢీ కొట్టి పరారయ్యాడు. బాధితుడు రోడ్డు మీద పడిపోవడంతో ఎడమ చేయి విరిగిపోగా, కుడి కాలిపై కూడా గాయాలయ్యాయి. దీంతో వైద్యం నిమిత్తం సమీపంలోని గాయత్రి ఆస్పత్రికి తరలించారు. బాధితుడు సత్యంనాయుడు ఫిర్యాదు మేరకు పీఎం పాలెం పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

రీ సర్వేకు 18 దరఖాస్తులు

తగరపువలస: భీమిలి మండలం అన్నవరం పంచాయతీలో రీ సర్వేపై మంగళవారం నిర్వహించిన గ్రామసభకు 18 దరఖాస్తులు వచ్చాయి. సభలో సర్వే డీటీ లక్ష్మీకుమారి, వీఆర్వో పి.శ్యాం సుందరరావు, మేరుగు ఎల్లాజీ తదితరులు పాల్గొన్నారు. ఆనందపురం మండలం పెద్దిపాలెంలో జరిగిన రీ సర్వే గ్రామసభలో నాయకులు ఉప్పాడ అప్పారావు, మరుపిల్ల సాయి జ్ఞానేశ్వర్, రాజేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగులచవితి

పుట్టల వద్ద భక్తుల పూజలు


పీఎం పాలెంలో పుట్టలో పాలు పోస్తున్న భక్తులు


కృష్ణాపురంలో పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు

తగరపువలస: నాగులచవితి పండగను మంగళవారం గ్రామగ్రామాన స్థానికులు వేడుకగా జరుపుకొన్నారు. ఉద్యోగ, ఉపాధి నిమిత్తం బయట గ్రామాలకు వలస వెళ్లినవారు పండగ సందర్భంగా కుటుంబాలతో సొంత గ్రామాలకు చేరుకున్నారు. మిగిలిన రోజుల్లో వెలవెలపోయిన గ్రామాలన్నీ సందడిగా కనిపించాయి. ముఖ్యంగా తీరప్రాంత మత్స్యకార గ్రామాలన్నీ కుటుంబాలతో నిండిపోయాయి. దీంతో గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసింది. ఉదయం నుంచే సమీపంలో ఉన్న పుట్టల వద్దకు చేరుకుని, పూజలు చేశారు. నాగేంద్రునికి మొక్కులు తీర్చుకునే క్రమంలో భాగంగా తమ శక్తి కొలది పుట్టలలో మట్టి, వెండి వేశారు. నాగేంద్రుడికి ప్రతిమలు, కోడిగుడ్లు, పాలు, నువ్వుల చిమ్మిడి, పండ్లు, వస్త్రాలు సమర్పించారు. పుట్టమట్టిని బొట్టుగా పెట్టుకుని, అక్కడే బాణసంచా వెలిగించి తిరుగుపయనమయ్యారు.


కుమ్మరిపాలెంలో పుట్టల వద్ద పూజలు చేస్తున్న భక్తులు

కొమ్మాది/పీఎంపాలెం: జీవీఎంసీ 6వ వార్డు పీఎం పాలెం పరిధిలో ప్రజలు మంగళవారం వేకువ జామునే పుట్టల వద్దకు చేరుకుని పూజలు చేశారు. నాగరాజుకు పాలు, గుడ్లు, చిమిలి సమర్పించారు.

➡ జీవీఎంసీ 4వ వార్డు ఉప్పాడ, మంగమారిపేట, నిడిగట్టు, నేరెళ్లవలస, 8వ వార్డు రుషికొండ, ఎండాడ, సాగర్‌నగర్ ప్రాంతాల్లో నాగుల చవితి పూజలు ఘనంగా నిర్వహించారు.

భీమిలిలో..

భీమునిపట్నం: భీమిలి ప్రాంతం పెద్దబజారు, చిన్నబజారు, దొరతోట రోడ్డు, బీచ్‌రోడ్డుతో పాటు పలు ప్రాంతాల్లోని పుట్టల వద్ద భారీ ఎత్తున జనం చేరుకుని నాగేంద్రుడికి పూజలు చేశారు. చిన్నారులు, యువకులు బాణసంచా కాల్చారు.

పద్మనాభం: మండలంలో కృష్ణాపురం, మద్ది, రెడ్డిపల్లి, పద్మనాభం, ఇసకలపాలెం, అర్చకునిపాలెం, తునివలస, రేవిడి, బి.ఆర్.తాళ్లవలస, ఐనాడ గ్రామాల ప్రజలు పుట్టల వద్ద పూజలు చేశారు. గుడ్లు, చిమిలి వేసి నాగేంద్రుడికి సమర్పించారు.

క్రిప్టోగ్రఫీ అండ్ నెట్‌వర్క్ పుస్తకావిష్కరణ


పుస్తకం ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి ముత్తంశెట్టి

తగరపువలస: చెరకుపల్లి అవంతి ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన సీఎస్ఎం విభాగ అధ్యాపకురాలు శ్రీలక్ష్మి రచించిన క్రిప్టోగ్రఫీ అండ్ నెట్‌వర్క్ పుస్తకాన్ని మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఆధునిక యుగంలో క్రిప్టోగ్రఫీతో సున్నితమైన సమాచారాన్ని రక్షించవచ్చన్నారు. ఎన్‌క్రిప్షన్, ఫైర్‌వాల్, వీపీఎన్, బ్లాక్ చెయిన్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్ లెర్నింగ్ వంటి అధునాతన సాంకేతికతల ద్వారా సురక్షితమైన కమ్యూనికేషన్‌ను నిర్ధారించవచ్చన్నారు.

కూరగాయల దుకాణం వద్ద వివాదం

తగరపువలస: ఆనందపురం మండలం వేములవలస ఫ్లై ఓవర్ కింద ఫుట్‌పాత్‌లపై నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న కూరగాయల దుకాణం వద్ద మంగళవారం సాయంత్రం వివాదం చోటుచేసుకుంది. దుకాణదారునికి, వినియోగదారులకు మధ్య జరిగిన వివాదంలో పోలీసులు జోక్యం చేసుకుని వారించారు.

ర్యాగింగ్‌తో భవిష్యత్తు అంధకారం


సదస్సులో మాట్లాడుతున్న ఏసీపీ అప్పలరాజు

మధురవాడ: ర్యాగింగ్ చేస్తే విద్యార్థుల భవిష్యత్ అంధకారం అవుతుందని డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎం. వెంకటశేషమ్మ, విశాఖ నార్త్ డివిజన్ ఏసీపీ అప్పలరాజు పేర్కొన్నారు. జీవీపీ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం విద్యార్థులకు, సీనియర్లకు ర్యాగింగ్‌పై నిర్వహించిన అవగాహన సదస్సుల్లో వారు మాట్లాడారు. తోటి విద్యార్థులను ఇబ్బంది పెట్టి ఆనందపడడం సరికాదన్నారు. చట్టాలు, హక్కులు, బాధ్యతలతో పాటు పలు అంశాలను జడ్జి వెంకట శేషమ్మ విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో డీన్ ఎస్.సుబ్బారావు, గాయత్రి కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చవితి వేళ.. కాస్త విరామం

- సొంత గ్రామాలకు ప్రజలు
- బోసిపోయిన రహదారులు


వెలవెలపోయిన జాతీయరహదారి

తగరపువలస: నాగుల చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని చిట్టివలస కార్మికవాడలోని ప్రజలు సొంత గ్రామాలకు వెళ్లిపోవడంతో మంగళవారం ఏ రహదారి చూసినా ట్రాఫిక్ లేకుండా బోసిగా కనిపించింది. మంగళవారం మార్కెట్‌కు సెలవు కూడా కావడంతో కూడళ్లు, రహదారులు వెలవెలపోయాయి. తగరపువలస కేంద్రంగా నిత్యం విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం వైపు వెళ్లే జాతీయ రహదారులు వాహనాల రాకపోకలతో కిక్కిరిసి ఉంటాయి. కనీసం రోడ్డు దాటాలంటేనే ఇక్కడి ప్రజలు హడలెత్తిపోతారు. అలాంటిది చవితి కారణంగా ఈ జాతీయ రహదారులు ఖాళీగా దర్శనమిచ్చాయి. తగరపువలస ప్రైవేట్ మార్కెట్ కూడా ఉదయం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు రద్దీగా ఉంటుంది. అంబేడ్కర్ కూడలి నుంచి ప్రైవేట్ మార్కెట్ దాటుకుని వెళ్లడానికి కూడా వాహనదారులు ప్రయాస పడుతుంటారు. అలాంటిది మార్కెట్‌తో పాటు ప్రధాన రహదారిపై పెద్దగా జన సంచారం లేకుండా పోయింది.


ఖాళీగా దర్శనమిస్తున్న ప్రైవేట్ మార్కెట్


దుకాణాలు లేక ఖాళీగా ఉన్న ప్రధాన రహదారి

ఉన్నదాంతో సంతృప్తి చెందితే అంతా ఆనందమే..


అధ్యాపకులను ఉద్దేశించి మాట్లాడుతున్న బ్రహ్మకుమారి మాధురి

తగరపువలస: మనకు ఉన్నదాంతో సంతృప్తి చెందితే అంతా ఆనందమేనని బ్రహ్మకుమారి మాధురి అన్నారు. లేనిదాని కోసం అర్రులు చాస్తే అనర్థాలు తలెత్తుతాయని చెప్పారు. 'ఆత్మశాంతి, బాహ్యశాంతి, ఒత్తిడిని జయించడమెలా' అనే అంశంపై చెరకుపల్లి అవంతి విద్యాసంస్థల అధ్యాపకులకు మంగళవారం నిర్వహించిన వ్యక్తిత్వ వికాస తరగతుల్లో ఆమె మాట్లాడారు. జ్ఞాన ద్వారాలు తెరవడం ద్వారా మన శరీరం, ఆత్మలో ఉన్న రుణాత్మక అంశాలను బయటకు పంపించవచ్చన్నారు. నిశ్శబ్దాన్ని అలవాటు చేసుకుని, ఉదయం నిద్ర లేచిన తరువాత, రాత్రి నిద్రపోయే ముందు నచ్చిన దేవతలను స్మరించుకోవడం ద్వారా రోజంతా ప్రశాంత వాతావరణంలో పనులు పూర్తి చేసుకోవచ్చని చెప్పారు. అవంతి విద్యాసంస్థల చైర్మన్, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ మనలో ఉన్న వైఫల్యాలను పక్కన పెట్టి మనం చేయగలిగేది గట్టిగా ప్రయత్నిస్తే విజయం సాధించవచ్చన్నారు. తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ తనలోని స్టైల్స్‌నే అనుకూలంగా మార్చుకుని వరుస విజయాలు సాధిస్తున్నారని గుర్తు చేశారు. బ్రహ్మకుమారీల విధానంలో శరీరానికే కాకుండా మనసును ప్రశాంతంగా ఉంచితే పూర్తి చార్జింగ్ అవుతామన్నారు. ఈ సందర్భంగా అధ్యాపకుల సందేహాలకు బ్రహ్మకుమారి మాధురి సమాధానాలు ఇచ్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి.మురళీకృష్ణ, డైరెక్టర్ ఆకుల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణ నామ సంకీర్తనతో ప్రశాంతత

- భగవద్గీత వ్యాప్తిలో కృష్ణ చైతన్య ఉద్యమం సఫలీకృతం
- హరేకృష్ణ మూవ్‌మెంట్ అధ్యక్షుడు నిష్కించిన భక్తదాస

తగరపువలస: భగవద్గీతలో శ్రీకృష్ణ భగవానుడు అందించిన అమృత సందేశాన్ని విశ్వవ్యాప్తం చేయడంలో భక్తి వేదాంత శ్రీల ప్రభుపాదులు స్థాపించిన కృష్ణచైతన్య ఉద్యమం సఫలీకృతం అయిందని హరేకృష్ణ మూవ్‌మెంట్ అధ్యక్షుడు డాక్టర్ నిష్కించిన భక్తదాస తెలిపారు. హరేకృష్ణ మూవ్‌మెంట్ వ్యవస్థాపక గురువు భక్తి వేదాంత స్వామి ప్రభుదాస 47వ తిరోభావ వర్ధంతి సందర్భంగా గంభీరం ఐఐఎంవీ రోడ్డులో మంగళవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా ప్రభుపాదుల విగ్రహానికి వివిధ రకాల ద్రవ్యాలు, పుష్పాలతో అభిషేకించి దీపహారతులు అందించారు. ఈ సందర్భంగా భక్తులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ప్రపంచం ఎదుర్కొంటున్న ఆధునిక సంక్షుభిత పరిస్థితులలో భగవద్గీత మానవాళికి చలివేంద్రంలా పనిచేస్తుందన్నారు. ఈ బోధనల ఆధారంగా హరేకృష్ణ ఉద్యమ భక్తులు నిర్వహిస్తున్న అనేక కార్యక్రమాలతో జనులు ఆధ్యాత్మిక ప్రయోజనం పొందుతున్నారన్నారు. 1960లో ప్రభుపాదులు ఈ కృష్ణనామ సంకీర్తనను విశ్వవ్యాప్తం చేశారన్నారు. ఆయన అందించిన ఈ ఒకే మంత్రం ద్వారా ప్రపంచంలో అన్ని దేశాల ప్రజల ప్రశాంతత పొందుతున్నారన్నారు. ఈ సంకీర్తన యజ్ఞం కారణంగా మనుష్యుల మధ్య ఐకమత్యం పొందగలుగుతున్నారన్నారు. ఈ సందర్భంగా అంబరీష దాసచే గురుపూజ, స్వామి ప్రభుదాస లీలా స్మరణ, దామోదర హారతి, శ్రీకృష్ణునికి నెయ్యిదీపాల అర్పణ, ప్రసాద వితరణ చేశారు.


ప్రభుపాదులకు పండ్లతో జలాభిషేకం

కొమ్మాది సిగ్నల్ వద్ద వివాదం

ఇరువర్గాల పరస్పర ఫిర్యాదు

మధురవాడ: కొమ్మాది జంక్షన్ సిగ్నల్ వద్ద ఇటీవల జరిగిన వివాదంపై ఇరు వర్గాలు ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకున్నారు. దీనికి సంబంధించి పీఎం పాలెం పోలీసులు తెలిపిన వివరాలివి.. ఆర్‌జీకే కాలనీ బ్లాక్-110, టీఎఫ్-6లో నివాసముంటున్న టి.వినోద్‌కుమార్ ఈ నెల 2వ తేదీన రాత్రి 9.30 గంటల సమయంలో తన కారులో స్నేహితురాలు సాయిలక్ష్మితో వెళ్తుండగా కొమ్మాది వద్ద రెడ్ సిగ్నల్ పడడంతో కారు ఆపారు. వెనుక నుంచి మోటారు సైకిల్‌పై ప్రయాణిస్తున్న శ్రీహరి హారన్ కొడుతూ ఉండడంతో, శబ్దం ఆపమని కోరారు. ఈ విషయంలో వివాదం తలెత్తడంతో వినోద్‌కుమార్ కాలర్‌ను శ్రీహరి పట్టుకోగా.. శ్రీహరి భార్య, కుమారుడు అతని స్నేహితురాలిని కొట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే, సిగ్నల్ వద్ద పక్కకు రావడం కోసం హారన్ కొట్టిన తనతో పాటు కుటుంబ సభ్యులపై తేళ్ల వినోద్ చేతులతో కొట్టి బెదిరించాడని శ్రీహరి కూడా ఫిర్యాదు ఇచ్చారు. ఇరువురి ఫిర్యాదులపై పీఎం పాలెం పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.